అక్రమాల 'గుట్టు' తేలింది.....
ఇక వేటు ఖాయమే!

- కలెక్టర్ నుంచి డీసీవోకు అందిన డీసీసీబీ నివేదిక
- అక్రమార్కుల ఆస్తుల జప్తుకోసం డీఆర్వో సిఫార్సు
- బ్యాంకు అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు
- త్వరలో జరిగే పాలకవర్గ సమావేశంలో నిర్ణయం


డీసీసీబీ ప్రధాన కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో పలువురు అధికారులు, సిబ్బందిపై త్వరలోనే క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి.ఐదేళ్ళ వైసీపీ పాలనలో డీసీసీబీలో ఆర్థిక విధ్వంసం, కోట్లాది రూపాయిల అవినీతి తదితర అంశాలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే.పాలకవర్గం, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, రుణాల మంజూరులో వైసీపీ శ్రేణులకే పెద్దపీట వేయడం, కమీషన్లకు తెరతీయడం,ఉద్యోగ నియామకాల్లోనూ అవకతవకలకు పాల్పడడం తదితరాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఆర్వో మోహన్‌కుమార్ విచారణ జరిపి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే.విచారణలో ఈ అంశాలన్నీ నిజమేనని తేలినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ఆ రిపోర్టును కలెక్టర్ గతవారం డీసీవో లక్ష్మీకి అందిస్తూ అక్రమార్కులపై తదుపరి చర్యలకు సిఫార్సుచేశారు. డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి అధ్యక్షతన త్వరలో జరగనున్న సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. దోషులుగా తేలిన అప్పటి వైసీపీ నాయకులు, బ్యాంకు చైర్‌పర్సన్ రెడ్డెమ్మతో పాటు సెవెన్‌మెన్ కమిటీ సభ్యులందరి ఆస్తుల జప్తుకు చర్యలు తీసుకునే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు అప్పటి వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తి బ్యాంకు ఆస్తులను, నిధులను పప్పుబెల్లాల్లా అందించిన 20మందికి పైగా బ్యాంకు అధికారులు, సిబ్బందిపై ఇంక్రిమెంట్ కట్ వంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. వీరిలో కొందరిపై వేటు పడే అవకాశం కూడా ఉంది. ఐదేళ్ళు బ్యాంకు చైర్‌పర్సన్‌గా రెడ్డమ్మ వున్నప్పటికీ వైసీపీ నేత అయిన ఆమె భర్త కృష్ణమూర్తి సమావేశాల్లో కూర్చోవడం, అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగేది.బ్యాంకు అధికారులతో కొందరు డైరెక్టర్లు కుమ్మక్కై రుణాలకు సంబంధించిన ప్రతి ఫైల్‌కు 10శాతం వసూలు చేసి మంజూరు చేసేవారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండదండలతో పాలకవర్గ సభ్యులు వారి బంధువుల పేర్లతో రికార్డుల్లో లేకుండా రూ.10 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. ఒక్క పైసా కూడా ఎవ్వరూ చెల్లించలేదు. 2022లో జరిగిన బ్యాంకు ఉద్యోగుల నియామకాల్లోనూ అక్రమాలు జరిగాయి. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల మేర వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఈ మొత్తాన్ని అధికారులు, పాలకవర్గం 50-25-25 శాతాల మధ్య పంచుకున్నారు. డబ్బులిచ్చి ఉద్యోగాలు పొందని సిబ్బంది పాలకవర్గ సభ్యుల చుట్టూ తిరిగినా పైసా కూడా వెనక్కి రాలేదు. టెర్మినేట్, సస్పెండ్ అయిన ఉద్యోగుల నుంచి కూడా భారీ మొత్తాలు తీసుకొని ఉద్యోగాలిచ్చినట్లు ఇటీవల జరిగిన విచారణలో తేలింది. అటెండర్, వాచ్‌మెన్ నియామకాల్లో గోల్‌మాల్, ఓటీఎస్, అమూల్ రుణాల పేరిట అక్రమార్జన అంశాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తలపై విచారణ అధికారి సమగ్ర విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. త్వరలో జరిగే బ్యాంకు బోర్డు సమావేశంలో ఆస్తుల జప్తు, ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు, ఇంక్రిమెంట్ కట్ వంటి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

డీఎఫ్‌వోగా సుబ్బరాజు



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజోతి): చిత్తూరు డిస్ట్రిక్ట్ ఫారెస్టు అధికారి(డీఎఫ్‌వో)గా సుబ్బరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన కోడూరు సబ్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు చిత్తూరు డీఎఫ్‌వో ఉన్న భరణిని స్టేట్ యాన్యువల్ యాక్షన్ ప్లానింగ్ విభాగం మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

సూర్యప్రభపై శివపుత్రుడు





ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో మంగళవారం రాత్రి వరసిద్ధి వినాయక స్వామి సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చారు.రాజమ్మ,రాజశేఖర నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఇంద్రసేన నాయుడు, లక్ష్మీపతినాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం స్వామి వారికి ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరన తీసుకురావడంతో ఆలయ కల్యాణ వేదిక వద్ద ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను సూర్య ప్రభ వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు.కాగా వినాయక స్వామికి మహానందీశ్వరాలయ అధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు.ఈవో పెంచలకిషోర్, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు,చిట్టిబాబు, ఉభయదారులు పాల్గొన్నారు.ప్రత్యేక ఉత్సవాల్లో బుధవారం చంద్ర ప్రభ వాహన సేవను నిర్వహించనున్నారు.

చిత్తూరులో నేడు 5కే మారథాన్

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి జిల్లా ఎయిడ్స్ నివారణ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు 5కే మారథాన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు టీబీ, ఎయిడ్స్ నివారణ అధికారి వెంకట ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు మెసానికల్ మైదానం వద్ద రన్‌లో పాల్గొనే విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 17-25 ఏళ్ల లోపు విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఉదయం 7.30 గంటలకు రన్‌ను ప్రారంభించి.. పీవీకేఎన్ గ్రౌండ్ వరకు వెళ్లి తిరిగి మెసానికల్ మైదానం వద్దకు చేరుకోవాలన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన మహిళ, పురుషులకు రూ.10వేలు, రెండో స్థానంలో నిలిచినవారికి రూ.7వేలను బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక్కడ గెలుపొందిన వారు విజయవాడలో జరిగే మెగా మారథాన్‌లో పాల్గొంటారని చెప్పారు.

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోండి

- వైసీపీ నేతల డిమాండు


చిత్తూరులో వైసీపీ నాయకుల ర్యాలీ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు డిమాండు చేశారు. యూరియా కొరతను నిరసిస్తూ చిత్తూరు,పలమనేరు,నగరి ఆర్డీవో కార్యాలయాల వద్ద అన్నదాత పోరు పేరిట వైసీపీ మంగళవారం ఆందోళనలు చేపట్టింది.వైసీపీ శ్రేణులు ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని ఆర్డీవోలకు వినతిపత్రాలను సమర్పించారు.జిల్లాలో రైతులు యూరియా కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటుండగా దుకాణాల యజమానులు బ్లాక్‌లో యూరియా బస్తాను రూ.300 అదనంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. రైతులు పొలానికి వెళ్ల కుండా యూరియా కోసం క్యూలైన్లో నిలబడే పరిస్థితి వుందన్నారు.చిత్తూరులో మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, పార్టీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి, పలమనేరులో పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, నగరిలో రోజా నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, వెంకటే గౌడ, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో ఏం జరుగుతోంది?

- ఆడపిల్లల నిష్పత్తి ఎందుకు తగ్గుతోంది?
- విచారణకు ఆదేశించిన కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెయ్యి మంది మగశిశువులకు.. 629 ఆడ శిశువులు మాత్రమే జన్మిస్తున్నారు. ఇదీ గత మూడు నెలల్లో శ్రీకాళహస్తిలోని జనన గణాంకాల నిష్పత్తి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1000:900 ఉంటే, శ్రీకాళహస్తిలో మాత్రం ఆ నిష్పత్తి ప్రమాదకరంగా ఉంది. ఈ నివేదికను చూసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆందోళన వ్యక్తంచేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్స్ అడ్వైజర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో విచారణ కమిటీ వేసి విచారించి.. కారణాలు విశ్లేషించి నెలలోపు నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్‌ను ఆదేశించారు. ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోం వైద్యులపై నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో లింగనిర్ధారణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టంచేశారు. మారుమూల గ్రామాల్లోనూ లింగనిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు.


పుంగనూరు సీడీసీఎంఎస్ గోదాములో కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

యూరియా కొరత లేదు

రెండు నెలలకు సరిపడా నిల్వలున్నాయన్న కలెక్టర్

పుంగనూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతలేదని.. రెండు నెలలకు సరిపడే 2 వేల మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు.పుంగనూరు సీడీసీఎంఎస్ గోదాములో రైతులకు యూరియా పంపిణీ చేయడంతో పాటు అక్కడున్న నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లో వరిసాగు అధికంగా ఉండటంతో రెండు నియోజకవర్గాల్లో తనిఖీలు చేసి అదనంగా యూరియా అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 18 వేల మంది రైతులకు ఆర్ఎస్‌కేలతో రైతుకు ఒక బస్తా చొప్పున 1500 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు మరొక బస్తా చొప్పున యూరియా అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత ఏడాది జిల్లాలో 45 వేల హెక్టార్లలో పంటలు పండించగా 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 21 వేల హెక్టార్లలో పంటలు సాగు చేయగా.. 13 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో 20 రోజుల తర్వాత మరో విడత పంపిణీ చేస్తామన్నారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ మురళీధర్, పుంగనూరు ఏడీ శివకుమార్‌రాజు, తహసీల్దార్ రాము, ఏవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంబోదరపల్లె దళితవాడలో దాడులు

- ఆరుగురికి గాయాలు




ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న క్షతగాత్రులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం అంబోదరపల్లె దళితవాడలో ఓ వర్గం కత్తులతో దాడికి పాల్పడగా ఆరుగురు గాయపడ్డ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసంతి కథనం మేరకు ...అంబోదరపల్లె దళితవాడకు చెందిన బాబును ఒక వివాహేతర సంబంధం గురించి ఎందుకు ప్రచారం చేస్తున్నావంటూ వరదన్ అనే వ్యక్తి నిలదీశాడు. దీంతో బాబు ఆగ్రహించి వరదన్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని వరదన్ తన బంధువులకు తెలపడంతో వారంతా కలిసి మంగళవారం సాయంత్రం బాబు ఇంటి వద్దకు వెళ్లారు. ఈలోపు బాబు తన వర్గీయులైన చిరంజీవి, మోహన్, జ్యోతికుమారి, రమ్య, మరియ, ఫైల్‌మేన్, రాణితో కలిసి వరదన్ వర్గీయులపై ఇనుపరాడ్లతో,కత్తులతో దాడులు చేశారు.బాలకృష్ణ, శశి, శోభ, నీలమ్మ, మురుగన్, వరదన్ గాయపడగా చికిత్స నిమిత్తం మొదట తూగుండ్రం పీహెచ్‌సీకి, అనంతరం అక్కడినుంచి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో కత్తిపోట్లు ఎక్కువ తగిలిన బాలకృష్ణను తిరుపతి రమాదేవి ఆస్పత్రికి తరలించారు.వరదన్ గంగాధరనెల్లూరు పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో బాబు, చిరంజీవి, మోహన్, జ్యోతికుమారి, రమ్య, మరియ, ఫైల్‌మేన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.



నాకు పని చేయడమే తెలుసు

- టీటీడీలో బాధ్యతల నిర్వహణ ఎన్నోజన్మల పుణ్యఫలం
- సన్మాన సభలో ఈవో శ్యామలరావు

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'నాకు నిత్యం పనిచేయడమే తెలుసు. ప్రచారం చేసుకోవడం తక్కువ. చాలా దూరదృష్టితో పటిష్ట నిర్ణయాలు తీసుకుని అయిమమలు చేశాం. టీటీడీ అంటే మినీ గవర్నమెంట్. తిరుమలలో భక్తుల సౌకర్యాలు ఓవైపు, స్థానిక ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు మరోవైపు ఉంటాయి. ఈ రెండిటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. టీటీడీలో పనిచేయడం ఎన్నోజన్మల పుణ్యఫలం' అని బదిలీపై వెళుతున్న ఈవో శ్యామలరావు అన్నారు. తిరుపతిలోని టీటీడీ ఏడీ బిల్డింగులో మంగళవారం సాయంత్రం జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తుండటం చాలా ఆనందంగా ఉందన్నారు. లోపాలను సవరించుకుంటూ మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఉద్యోగుల సహకారాన్ని మరువలేనిదన్నారు. వచ్చే 25 ఏళ్లను దృష్టిలోపెట్టుకుని భక్తులకు అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాల నాణ్యతగా ఉండేలా వ్యవస్థలను తీసుకొచ్చామన్నారు. తనకు అవకాశమిచ్చిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. టీటీడీలోని ఉన్నతాధికారులు, అధికారులు శ్యామలరావు సేవలను కొనియాడారు. తిరుమల, తిరుచానూరు, శ్రీనివాసమంగాపురం ఆలయాల అర్చకులు ఈవోకు వేదాశీర్వచనం చేశారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

టీటీడీ ఈవోగా నేడు సింఘాల్ బాధ్యతల స్వీకరణ

టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం బాధ్యతలు తీసుకోనున్నారు. ప్రస్తుతం ఈవోగా ఉన్న శ్యామలరావును జీఏడీకి బదిలీ చేయడంతో పాటు ఆస్థానంలో గతంలో ఈవోగా పనిచేసిన అనిల్‌కుమార్ సింఘాల్‌ను మళ్లీ ఈవోగా నియమించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బుధవారం ఉదయం 11-11.30 గంటల మధ్య శ్రీవారి ఆలయంలో సింఘాల్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే టీటీడీ బోర్డు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగానూ బాధ్యతలు తీసుకుంటారు.

కూరగాయల దాతలతో వాట్సాప్ గ్రూపు

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచన.. బ్రహ్మోత్సవాల్లో రోజుకు పది టన్నులు అవసరం

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదాలకు కూరగాయలు విరాళంగా టీటీడీకి అందజేస్తున్న దాతలతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచించారు. కూరగాలయ దాతలతో బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల అన్నప్రసాద విస్తరణ చేసిన నేపథ్యంలో దాతలు మరింత ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ప్రస్తుతం దాతలు రోజుకు 25 రకాల కూరగాయలు, 6 నుంచి 7 టన్నులు అందజేస్తున్నారని, బ్రహ్మోత్సవాల సమయంలో రోజుకు 10 టన్నులు అవసరముంటుందని అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్రకుమార్, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి వివరించారు. కూరగాయల విరాళాలు 2022లో 5.79 శాతం నుంచి 2025లో దాదాపు 7 శాతానికి పెరిగాయని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, ఏపీకి చెందిన కూరగాలయ దాతలను వెంకయ్య చౌదరి శ్రీవారిప్రసాదాలతో సత్కరించారు.



శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


ఆదివారం హుండీ ఆదాయం: రూ.2.10 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,117

తలనీలాలు సమర్పించినవారు: 22,765



ఆశ పెంచుకో.. ఆ ఆలోచన తుంచుకో



ఈ పక్కన ప్రస్తావించిన రెండూ ఉదాహరణలు మాత్రమే. మొబైల్ కొనివ్వలేదనో.. మార్కులు రాలేదనో.. ఆశించిన ర్యాంకు పొందలేదనో.. ప్రేమ విఫలమైందనో.. ఆర్థిక బాధలతో వేగలేకో.. కుటుంబ స్పర్థలతోనో.. కుంగుబాటుతోనో .. ఇలా రకరకాల కారణాలతో, క్షణికోద్రేకంతో కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తమ మీద ఆశలు పెట్టుకున్న కుటుంబ సభ్యులను విషాదంలోకి నెట్టేస్తున్నారు. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇలాంటి వారిని గుర్తించి భుజం తట్టి..సాంత్వన కలిగిస్తే మరణాన్ని ఆశ్రయించరని చెబుతున్నారు మానసిక నిపుణులు. బుధవారం ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథకం.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

- ఈ ఏడాది జూన్ 25న తొట్టంబేడులో పంట,వ్యక్తిగత రుణాల తీర్చలేక ఆందోళన చెంది రామయ్య(56) అనే రైతు ఉరి వేసుకుని మృతి చెందాడు.
- కోటలో కూలీ పనులు చేసుకునే చల్లప్పన్(28) రకరకాల కష్టాలు వెంటాడటంతో బతుకుపై విరక్తి పెంచుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.





సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ పాటలో..నొప్పిలేని నిమిషమేది జననమైన మరణమైన జీవితాన అడుగు అడుగునా...నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీదికాదు బతుకు అంటే నిత్య ఘర్షణ..అని జీవితం గురించి రెండు ముక్కల్లో చెబుతారు. కానీ కొందరు ఏ కష్టం కలిగినా తట్టుకోలేరు. పెద్ద ఉపద్రవం మీదపడినట్టు భావిస్తారు. తమకే కష్టాలొస్తున్నాయని డీలాపడిపోతారు. ఈక్రమంలోనే క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడుతుంటారని మానసిక శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఆత్మహత్యల సంఖ్య కొంతమేర తగ్గడం శుభసంకేతంగా పోలీసులు పేర్కొంటున్నారు. గత ఏడాది దాదాపు 102 మంది బలవన్మరణాలకు పాల్పడగా గత నెల వరకు 79 మంది ప్రాణాలు తీసుకున్నట్లు జిల్లా క్రైం బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి.

ఎందుకీ విపరీత ధోరణులు

అయిన దానికీ కానిదానికీ కొందరు విపరీత ధోరణి కోణంలో చూస్తుంటారు. తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. నైరాశ్యాన్ని నింపుకొంటారు. ఇలాంటి పరిస్థితుల్లోనే క్షణికావేశంలో తనువు చాలించాలని నిర్ణయించుకుంటారు. వీరెవరూ కష్టాలను తట్టుకోడానికి సిద్ధపడరు. పరిష్కారంపై దృష్టి పెట్టరు. ప్రతిదానికీ పరిష్కారమో, ప్రత్యామ్నాయమో ఉంటుందని గుర్తించరు. ఈ అంతర్ముఖులు తమ సమస్య, ఆందోళన, మానసిక ఒత్తిడి గురించి ఎవరితోనూ పంచుకోరు. ముభావంగా, ఒంటరిగా ఉంటుంటారు. ఇలాంటి మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారిని కుటుంబసభ్యులో, బంధువులు లేదా స్నేహితులో గుర్తించాలి. కౌన్సెలింగ్ ఇచ్చేలా ధైర్యవచనాలు చెబితే పెనుముప్పు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. సానుకూల దృక్పథం వీరికి నూరిపోస్తే జీవితంపై ఆశపెంచుకుని మరణం ఆలోచన దరిచేరనివ్వరంటున్నారు.

ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



పెరుగుతున్న న్యూక్లియర్ కుటుంబాలు, పిల్లలు దూరం కావడం, తగిన ఆర్థిక వనరులు లేకపోవడం, నిరంతర ఒత్తిడి, సాంఘిక వెసులుబాటు, పోటీ ప్రపంచంలో వెనుకబడటం, ఆరోగ్య సమస్యలతో ఎక్కువ మంది తీవ్రంగా మానసిక ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వారిలో, ఆందోళన, దిగులు, ముభావం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీరిలో కొందరు ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. ఈ లక్షణాలున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఒంటరిగా ఉంచకుండా ఎవరోఒకరు తోడుగా వుండాలి. వారి భావాలను ఖండించకుండా సహానుభూతితో మెలగాలి. సమస్యలపై చర్చించకూడదు. వివాద రహిత విషయాలు మాట్లాడాలి. నలుగురిలో కలుపుకోవాలి. అవసరమైతే మానసిక వైద్యుడ్ని సంప్రదించాలి.

- డాక్టర్ కిషోర్, సీనియర్ సైకియాట్రిస్టు, తిరుపతి

సానుకూల దృక్పథమే ఊపిరి



జీవితంలో సమస్యలు సహజం. అవి శాశ్వతం కావని గుర్తించాలి. సహనం, ధైర్యం ప్రదర్శిస్తే పరిష్కారాలు కనిపిస్తాయి. ఆత్మహత్య అంటే పిరికితనం. సమస్య నుంచి పారిపోవడం. కానీ ఇది పరిష్కారం కాదు. ఎంత కష్టమైన ఇబ్బంది ఎదురైనా పోతుందనే నమ్మకం సంపూర్ణ బలాన్నిస్తుంది. ఏ పరిస్థితిలోనూ ఆశను వీడకూడదు. ఆశ ఉంటే శ్వాస వెంటే అంటారు. అదే మార్గం చూపుతుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోందనే భావన కలిగితే ఆత్మీయుల దగ్గరకు వెళ్ళాలి. కుటుంబ సభ్యులను ప్రేమించడం,క్షమాగుణం అలవర్చుకోవడం నేర్చుకోవాలి. తుది శ్వాస వరకు జీవితాన్ని ఆనందంగా గడపాలనే దృఢచిత్తం పెంచుకోవాలంటే సానుకూల వైఖరి పెంచుకోవాలి

- శ్రీలత, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ, తిరుపతి

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్‌కు చెక్కు అందజేస్తున్న దాత చిరంజీవి

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. రాజమండ్రికి చెందిన చిరంజీవి విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మహిళా క్రికెటర్



నల్లపురెడ్డి చరణి

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం భారత మహిళా క్రికెటర్ నల్లపురెడ్డి చరణి దర్శించుకున్నారు. ఈమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి కూడా స్వామి సేవలో పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మూడు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలోని పేథాలజీ విభాగంలో మూడు ప్రాజెక్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ అపర్ణబిట్లా ఒక ప్రకటనలో కోరారు. ప్రాజెక్టు అసోసియేట్, ప్రాజెక్టు అసిస్టెంటు పోస్టులతోపాటు వ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డీబీటీ నిదాన్ కేంద్ర, స్విమ్స్, తిరుపతికి పోస్టు ద్వారా పంపాలని ఆమె సూచించారు. ఈ నెల 27లోపు ఒరిజినల్ దరఖాస్తులతోపాటు సర్టిఫికెట్లను, ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలు, అప్లికేషన్ల కోసం స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని వివరించారు.

కంపల్లె రవిచంద్రన్‌కు కీర్తి పురస్కారం



తిరుపతి (కల్చరల్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : టీటీడీ సప్తగిరి మాసపత్రిక ప్రత్యేక శ్రేణి ఉపసంపాదకులు డాక్టర్ కంపల్లె రవిచంద్రన్ కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ నెల 23న జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ప్రాచీన సాహిత్య విభాగంలో తొమ్మిది, ఆధునిక సాహిత్య విభాగంలో ఏడు గ్రంథాలు, సినిమా సాహిత్య విభాగంలో 13 పుస్తకాలు, అనువాద సాహిత్య విభాగంలో ఆరు గ్రంథాలతోపాటు సుమారు ఐదువేల వ్యాసాలను రవిచంద్రన్ రాశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ కళారత్న పురస్కారం కూడా అందుకున్నారు.

పిల్లపాళెంలో ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న గ్రామస్తులు




పిల్లపాళెంలో ప్రైవేటు భూముల్లో 40 అడుగుల లోతుకు తవ్వడంతో నీటితో నిండిపోయిన గోతులు

రేణిగుంట సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాను పిల్లపాళెంవాసులు అడ్డుకున్నారు. మండలంలోని పిల్లపాళెంలో ప్రైవేటు భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు మంగళవారం ట్రాక్టర్లను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ఆ దారిలో వెళ్తున్న తమ పిల్లలకు ప్రమాదం జరుగుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గతంలో భూ యజమానికి హెచ్చరించామన్నారు. అయితే సదరు భూ యజమాని తిరుపతికి చెందిన వ్యక్తికి తన భూమిని లీజుకు ఇచ్చాడన్నారు. దీంతో నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోందన్నారు. సుమారు నలభై అడుగుల లోతు తవ్వేశారని, ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరిందన్నారు. ఆ గుంతల్లో తమ పిల్లలు ఈతకు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై లీజుదారుడి దృష్టికి తీసుకెళ్లామని అయినా పట్టించుకోకపోవడంతో అడ్డుకున్నామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా చెయ్యకుండా కందకాలు తవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న గాజులమండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోగా ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు తరలిపోయాయి.

తీర పోలీస్ స్టేషన్ మరమ్మతులకు ప్రతిపాదనలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంతాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ దుగరాజపట్నం కోస్టల్ పోలీస్‌స్టేషకు మరమ్మతులు, కాంపౌండ్ వాల్ నిర్మాణ అంశాలకు సంబంధించి అంచనాల ప్రతిపాదనలు పంపుతామన్నారు. మత్స్యకారులు వేటకు సమయంలో వెంట ఆధార్ కార్డు, బయోమెట్రిక్‌కార్డును తీసుకెళ్లేలా అవగాహన కల్పించాలని జిల్లా మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. తూపిలి పాళెం, దుగరాజపట్నం బీచ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మెరైన్ పోలీసులకు సూచించారు. దీనికి అవసరమైన నిధులు సమకూరుస్తామన్నారు. మన రాష్ట్రానికి చెందిన బోట్లను గుర్తించడానికి నిబంధనల మేరకు కలర్ కోడింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సముద్రంపై అక్రమ చేపల వేట జరగకుండా జిల్లా మత్స్యశాఖ, కోస్టల్ సెక్యూరిటీ అధికారులతో కలిసి జాయింట్ పెట్రోలింగ్ చేయాలన్నారు. తమిళనాడు నుంచి మత్స్యకారులు మెకనైజ్ బోట్లతో అక్రమంగా మనవైపున్న సముద్ర జలాల్లో చేపలు పడుతున్నారని అధికారులు తెలపగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని కలెక్టరు చెప్పారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డిప్యూటీ ఎస్పీ వెంకటరమణ డిప్యూటీ ఎస్పీ కోస్టల్ సెక్యూరిటీ పోలీసు బాలిరెడ్డి, అధికారులు విజయకుమార్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తుడా ప్లాట్ల ఈ-వేలానికి విశేష స్పందన



ఈ-వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న డాలర్ దివాకర్ రెడ్డి

తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట-తిరుపతి హైవే మార్గంలో పద్మావతినగర్‌లోని సూరప్పకసం తుడా లేఅవుట్‌లోని తుడా స్థలాలను ఈ- వేలం ద్వారా విక్రయిస్తున్నారు. ఈనెల 4న ప్రారంభమైన ఈ-వేలం 17వ తేదీతో ముగియనుంది. 277 ప్లాట్లకు గాను ఇప్పటివరకు 35 ప్లాట్ల విక్రయించారు. తద్వారా దాదాపు రూ.13 కోట్ల మేర ఆదాయం లభించినట్లు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వేలం ప్రక్రియను పరిశీలించారు. వేలం వివరాలను తుడా సెక్రటరీ డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్‌బాబు వివరించారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చదరపు గజం రూ.14వేలకు ధర నిర్ణయించామని దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీఫైనల్స్ పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం నిర్వహించనున్నారు.ఉదయం 10 గంటలకు వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ధృతి ఆడిటోరియంలో కార్యక్రమం ప్రారంభంకానుంది.సాంకేతికత-సామాజిక సమస్యల పరిష్కారం అంశంపై విన్నూత్న ఆలోచనలకు ఇది వేదిక కానుంది. తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 220మంది విద్యార్థులు,పలు సాంకేతిక సంస్థలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. పాల్గొన్న వారికి వివిధ థీమ్‌లపై పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేస్తారు. దీంతో పాటు విజేతలనను ఫైనల్స్‌కు పంపనున్నారు.

పల్లంపేటలో దోపిడీ దొంగల అరెస్టు

- పోలీసుల అదుపులో కుదువ వ్యాపారి

ఏర్పేడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లో ఒంటరి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడడమే కాకుండా వారి ఆభరణాలను దోచేకెళ్లే వారిని అరెస్టు చేయడమేకాకుండా వారికి సహకరించిన కుదువ వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు... వెంటకగిరికి చెందిన ప్రసాద్ తన కారులో సొంతపనుల నిమిత్తం తిరుపతికి గతనెల 30న బయలుదేరాడు. మార్గమధ్యంలోని పల్లంపేట వద్ద కారు మర్మతులకు గురైంది. దీంతో రోడ్డుపక్కన కారును మరమ్మతులు చేసుకుంటుండగా శ్రీకాళహస్తి మండలం ఇంద్రపల్లికి చెందిన ప్రసాద్, పాతగుంట దళితవాడకు చెందిన హరి కారు యజమాని ప్రసాద్‌ను పలకరించారు. మరమ్మతులకు సహకరించారు. రాత్రి 8 గంటలైనా కారు రిపేర్‌కాలేదు. ఈక్రమంలో ముగ్గురు కలిసి సమీపంలో బ్రాందీషాపులో మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ బంగారు నగలను, సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోయారు. మత్తు నుంచి తేరుకున్న ప్రసాద్ తన వస్తువులు చోరీ అయినట్లు గుర్తించాడు. మూడు రోజుల పాటు ఇంద్రపల్లికి, పాతగుంట దళితవాడకు వెళ్లి నగలు, సెల్‌ఫోన్ ఇవ్వాలని కోరారు. వారు నగలను పల్లంపేటలో ఉన్న ఓ కుదువ వ్యాపారికి కుదువ పెట్టినట్లు చెప్పారు. దీనిపై ప్రసాద్ ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి విచారణ చేపట్టారు. విచారణలో చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీ చేసిన ఇద్దరిని, కుదవు పెట్టుకున్న వ్యాపారిని మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- నయా పంథా

గ్యాస్ కట్టర్‌తో తలుపు కోసి...!

వాంపల్లెలో చోరీకి పాల్పడ్డ దొంగలు



తలుపును గ్యాస్ కట్టర్‌తో కాల్చిన దుండగులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): శబ్దం రాకుండా సరికొత్త విధానంతో దొంగలు చెలరేగారు. గ్యాస్‌కట్టర్‌తో తలుపును కాల్చి ఇంట్లోని బంగారు ఆభరణాలను లూటీ చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం వాంపల్లెలో జరిగింది. నెల రోజుల వ్యవధిలో వాంపల్లిలో ఆరు వరుస చోరీలు వెలుగు చూశాయి. ఇంటికి తాళం వేసినట్లు కనిపిస్తే చాలు... రాత్రికి రాత్రే దొంగలు తెగబడుతున్నారు. ఒంటరి మహిళగా జీవనం సాగించే కరణం బుజ్జమ్మ సోమవారం రాత్రి సమీప గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఉదయం ఇంటికి చేరుకోగానే ప్రధాన ద్వారాన్ని కాల్చి దొంగలు లోపలకు చొరబడినట్టు గుర్తించింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ గోపి క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వరుస చోరీలు జరగడంపై లోతుగా ఆరా తీశారు. ప్రత్యేకించి మంగళవారం వెలుగు చూసిన చోరీలో శబ్ధంరాకుండా గ్యాస్‌కట్టర్ ఉపయోగించడంతో పరిసరాల్లో పలు నమూనాలను సేకరించారు. మహిళ ఫిర్యాదు మేరకు 16 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



చోరీపై విచారణ చేస్తున్న సీఐ గోపి

ఐదుగురు స్మగ్లర్ల అరెస్టు

- 9 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం రాజంపేట అటవీపరిధిలోని ఎస్ఆర్‌పాళెం ఫారెస్టు బీటులో మంగళవారం కూంబింగ్ నిర్వహించారు. ఈక్రమంలో రాళ్లమడుగు తుమ్మలబైలు జంక్షనుకు చేరుకోగా కొంతమంది ఎర్రచందనం దుంగలు మోసుకువెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటబడ్డారు. వారిని వెంబడించి ఐదుగిరిని పట్టుకున్నారు. వారి నుంచి 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారు తమిళనాడుకు చెందినవారుగా గుర్తించారు. దుంగలతో సహా స్మగ్లర్లు తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.4 లక్షల టపాసుల సీజ్

● ఇద్దరిపై కేసు నమోదు



టపాసులు, నిందితులను చూపిస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు నుంచి అనుమతుల్లేకుండా తరలిస్తున్న రూ.4లక్షల టపాసులను మినీ లారీతోపాటు సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. అక్రమ రవాణాను అరికట్టేందుకు ఇటీవల పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ముందస్తు సమాచారంతో జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ వద్ద తమిళనాడు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్రాంతాలకు టపాసులను తరలిస్తున్న మినీ లారీని పట్టుకున్నారు. అందులోని రూ.4లక్షల టపాసులను వాహనంతోపాటు సీజ్ చేశారు. వాహనంలో ఉన్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన శివకుమార్, యాదమరి మండలానికి చెందిన మణిగండన్‌పై కేసు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ.. బాణాసంచా వంటి ప్రమాదకరమైన వాటిని అక్రమంగా రవాణా చేయడం చట్ట విరుద్ధమన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లే చర్యలను ఎలాంటి పరిస్థితుల్లోనూ సహించమని హెచ్చరించారు. టపాసులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ సుధీర్, బాబురెడ్డి, బాబు, సిబ్బంది రాజేష్, సుబ్రహ్మణ్యం, బాష, నాగరాజులను సీఐ అభినందించారు.

కూటమి ప్రభుత్వ పాలన సూపర్ హిట్



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలన సూపర్‌సిక్స్‌లాగే సూపర్ హిట్ అయిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 15 నెలల కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బుధవారం అనంతపురంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారన్నారు. సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి పార్టీల అగ్రనేతలు పాల్గొననున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, ప్రసుతం 80,503 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. సీఎం ఆదేశాల మేరకు కేంద్రం మరో 50వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందన్నారు. అయితే వైసీపీ మాత్రం ప్రభుత్వంపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ నీచ రాజకీయాలపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేతలు త్యాగరాజన్, మోహన్ రాజ్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే రైతులపై ప్రేమ

● టీడీపీ అధికార ప్రతినిధి శ్రీనివాసులు

శాంతిపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ లబ్ధి కోసమే రైతులపై ప్రేమ ఉన్నట్లు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ గ్రామాలు ఆడుతున్నాడని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు ఆరోపించారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కార్యక్రమాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని వైసీపీ ప్రయత్నం చేస్తోందన్నారు. అపద్ధపు ప్రచారాలు, కుట్రలతో ఉనికి కోసం కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తుందన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో పొలంలోకి అడుగుపెట్టని జగన్ ఇప్పుడు రైతులకు కష్టాలంటూ డ్రామాలు మొదలు పెట్టారన్నారు. ఆ డ్రామాలకు రైతులు ఇప్పుడు 11 సీట్లకే పరిమితం చేసిన విషయం జగన్ మరిచినట్లున్నాడన్నారు. ఎరువుల సరఫరా విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను గుర్తించి పరిష్కారం చూపిందన్నారు. ఒక్క ఖరీఫ్ సీజన్‌కే 6.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఇప్పటి వరకు రైతులు 6.11 మెట్రిక్ టన్నుల యూరియాను వాడుకున్నారన్నారు. ప్రస్తుతం 80,503 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. యూరియా కేటాయింపులు, సరఫరాపై స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటే, వైసీపీ వాస్తవాలను దాచిపెట్టి రాజకీయ డ్రామాలు ఆడుతుందన్నారు. కుట్రలు, ఫేక్ ప్రచారాలు, రాజకీయ లబ్ధి కోసం రైతులను వాడుకుంటే ఆ రైతులే 2024 కంటే ఇంకా గోరంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

డిమాండుకు అనుగుణంగా యూరియా సరఫరా చేస్తాం

● కలెక్టర్ సుమిత్‌కుమార్

పెద్దపంజాణి, సెప్టెంబరు 9 (ఆంధ్రజోతి): పెద్దపంజాణి మండలంలోని వీరప్పల్లె, కొళత్తూరు, పెద్దపంజాణి కేంద్రాలలో మంగళవారం యూరియా పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరు సుమిత్‌కుమార్ పరిశీలించారు. రైతుల డిమాండును బట్టి ప్రభుత్వం యూరియా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.ఎంపీడీవో బాలాజీ, తహసీల్దారు హనుమంతు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించరా?

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా, స్పందించడం లేదని కళాశాలల యాజమాన్యాల సంఘం ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు.గత రెండు విద్యా సంవత్సరాల రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని, డిగ్రీ కోర్సు ఫీజులను సవరించి, కొత్త ఫీజు విధానాన్ని యూనివర్శిటీలకే అప్పగించాలని, డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లలో గందరగోళాన్ని తగ్గించాలని కోరారు.రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీల్లో కామన్ అఫిలియేషన్‌తో పాటు, అకడమిక్ క్యాలెండర్ ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.సెప్టెంబరు 20వ తేదీ లోపు ప్రభుత్వం స్పందించని పక్షంలో దీక్షకు దిగనున్నట్లు హెచ్చరించారు.

కైగల్ అభివృద్ధికి మోక్షమెప్పుడో?

● కలగా మిగిలిన జలాల సద్వినియోగం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన బైరెడ్డిపల్లె మండలంలోని ప్రముఖ పర్యాటకకేంద్రమైన కైగల్ దుముకురాళ్ల జలపాతం అభివృద్ధికి మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని పలువురు ఆశగా ఎదురుచూస్తున్నారు. పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేయడంతోపాటు కైగల్‌లో ప్రవహించే జలాలను ప్రభుత్వం ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని చెరువులకు మళ్లిస్తే సాగునీటిసమస్య లేకుండా సద్వినియోగం చేసుకోవచ్చని రైతులు ఎన్నోయేళ్లుగా నిరీక్షిస్తున్నారు. ప్రస్తుతం కైగల్ జలపాతం గుండా ప్రవహించే నదీజలాలు వృథాగా పక్కరాష్ట్రానికి తరలిపోతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి సెలయేరుల గుండా కైగల్ జలపాతంలో కలసి ఇక్కడినుంచి తమిళనాడు రాష్ట్రంలో కలసిపోతున్న ఈ జలాలు మండలంలోని రైతులకు ఉపయోగపడడంలేదు. గతంలో సంవత్సరం పొడవునా నిరంతరం జలప్రవాహంతో ఎగిసిపడుతూ పర్యాటకులకు కనువిందుచేసే ఈ జలపాతంలో ప్రస్తుతం వర్షాలు పడితే తప్ప జలప్రవాహం ఉండడంలేదు. ఇందుకు ప్రధానకారణం కైగల్ జలపాతంలో కలిసే నదీజలాలకు కర్ణాటక రాష్ట్రంలో కొన్నిచోట్ల డ్యాములు కట్టి అడ్డుకట్ట వేయడంతో నీటిప్రవాహం తగ్గిపోయింది. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుల్లో కైగల్ జలపాతం జలాలను సద్వినియోగం చేసుకుంటుండగా ఇక్కడ రైతులు వినియోగించుకునే పరిస్థితి లేక వారికి నిరాశ మిగిలింది. అలాగే ప్రకృతిరమణీయతకు మారుపేరుగా నిలిచిన కైగల్ జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.ఇక్కడి జలపాతం అందాలను వీక్షించడానికి జిల్లానుంచేగాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి సందర్శకులు అధికసంఖ్యలో తరలివస్తుంటారు. కైగల్ జలపాతానికి వెళ్లేదారి కూడా గుంతలమయమై, రాళ్లుతేలిపోయి అధ్వాన స్థితికి చేరుకుంది.ఇక్కడ పర్యాటకులకు తగిన భద్రత, సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తే పర్యాటకకేంద్రంగా మరింత ప్రాచుర్యంలోకి వస్తుంది. కైగల్ జలాలతో తమ పంటపొలాలు సస్యశ్యామలం అవుతాయని భావించిన రైతుల ఆశలు త్వరగా నెరవేరడానికి, దీంతోపాటు పర్యాటకకేంద్రంగా అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం ప్రత్యేక శద్ధ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కైగల్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు - అధ్వానంగా కైగల్ జలపాతానికి వెళ్లే దారి

పుంగనూరు ఆస్పత్రి అభివృద్ధికి కృషి: కలెక్టర్

పుంగనూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఏరియా ప్రభుత్వాస్పత్రిని అన్నివిధాలా అభివృద్ధి చేసి రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్షించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని, వైద్యులు, సిబ్బంది ఎల్లపుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పార్కింగ్ వద్ద బోర్డులు ఏర్పాటు చేసి రోగులకు లభించే సదుపాయాల సమాచారం అందుబాటులో ఉంచాలని చెప్పారు. సమస్యలుంటే తనకు వాట్సప్‌లో సమాచారం పంపితే సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. రోగులపై ఎవరైనా అమర్యాదగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వస్తే ఇంటికి పంపడం ఖాయమన్నారు. అలాగే పట్టణ సమీపంలోని గూడూరుపల్లె టిడ్కో కాలనీని పరిశీలించారు. పారిశుధ్య పనులు చేయడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, టిడ్కో అధికారులను ఆదేశించారు. వైద్యాధికారి హరిగోపాల్, తహసీల్దార్ రాము, సీఐ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సీజ్ చేసిన గ్రావెల్ టిప్పర్ల రిలీజ్

పాలసముద్రం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనదుర్గాపురం అడవిలో ఉన్న క్వారీ నుంచి తమిళనాడుకు గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను కలెక్టర్ ఆదేశాలతో సోమవారం తహసీల్దార్ అరుణ కుమారి, ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప సీజ్ చేసి, మైనింగ్ శాఖ అధికారులకు తెలిపారు. మంగళవారం జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు రెండు టిప్పర్లకు రూ.17,744 అపరాధ రుసుం విధించారు. క్వారీ నిర్వాహకులు అపరాధ రుసుం చెల్లించడంతో సీజ్ చేసిన రెండు టిప్పర్లను మంగళవారం సాయంత్రం రిలీజ్‌చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

పీఈఎస్ మెడిసిన్ విద్యార్థినికి అవార్డు

కుప్పం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌కు చెందిన 2021-2022 బ్యాచ్ విద్యార్థిని, ప్రస్తుతం ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని ముడిపల్లి సాయి జాహ్నవి విశిష్ట గౌరవాన్ని పొందారు. 2023 జనవరిలో నిర్వహించిన ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ యూనివర్శిటీ పరీక్షల్లో ఉత్తమ విద్యార్థిని (బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్)గా ఎంపికయ్యారు. ఈ ప్రతిష్ఠాత్మక నేపథ్యంలో ఆమెకు కవూరి హైమావతి అండ్ కవూరి చలపతిరావు బహుమతి లభించింది. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 27, 28 వార్షికోత్సవం సందర్భంగా జరిగిన వార్షిక పట్టాభిషేక మహోత్సవాలలో మంగళవారం ఆమెకు ప్రదానం చేశారు. ప్రతిభావంతురాలైన తమ విద్యార్థిని సాయి జాహ్నవికి ప్రతిష్ఠాత్మక అవార్డు లభించడంపై కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల యాజమాన్యం, డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న సాయి జాహ్నవి

'అనంత' సభ పర్యవేక్షణలో అమర్, నాని, ఆరణి



చిత్తూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం శివారులోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ మైదానంలో బుధవారం నిర్వహించనున్న 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్ సభ ఏర్పాట్ల పర్యవేక్షణలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన నేతలు కూడా పాల్గొంటున్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు ఒక్కో హామీ నెరవేర్చుకుంటూ వస్తున్నారు.పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేసిన నేపథ్యంలో నేడు అనంతపురం వేదికగా 'సూపర్ సిక్స్. సూపర్ హిట్' పేరుతో భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం సహా కీలక నాయకులు హాజరుకానున్నారు. సభా ఏర్పాట్లను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యవేక్షిస్తున్నారు. వీరిలో ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, షాజహాన్ బాషా తదితరులున్నారు.

బంజారాల మనోభావాలకు అనుగుణంగా

హథీరాంజీ మఠం సమస్య పరిష్కరిస్తాం

● టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారా నాయక్

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బంజారాల మనోభా వాలకు అనుగుణంగా హథీరాంజీ మఠం సమస్య పరిష్కరిస్తామని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు దారా నాయక్ తెలిపారు. మఠం భవనాల స్థితిగతులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హథీరాంజీ మఠం స్థితిగతులను దేవదాయ శాఖ అధికారుల నుంచి తెలుసుకుని పరిశీలించినట్లు చెప్పారు. ఇప్పటికే ఐఐటీ నిపుణులు ఈ భవనాన్ని పరిశీలించి నివేదికను సమర్పించారని చెప్పారు. ఆ మేరకు కలెక్టర్ పరిస్థితులకు అనుగుణంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ సమయంలో కొంత మంది సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలను చేయడం తగదన్నారు. హథీరాం బాబాజీని ఆరాధ్య దైవంగా బావించే తమ బంజారా కులస్తుల బలహీన తలను అవకాశంగా మలుచుకుని మనోభావాలను దెబ్బతీయాలని కొంత మంది చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. అన్యాక్రాంతమైన హథీరాంజీ మఠం భూముల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మఠం పరిరక్షణ సమితి అధ్యక్షులు బి.అమ్మనాయక్, మనోహర్‌నాయక్, రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు ఎం.సుబ్బయ్య, రవినాయక్, సిద్ధనాయక్, ఏ.కళావతి పాల్గొన్నారు.



హథీరాంజీ మఠం భవనాలను పరిశీలిస్తున్న దారు నాయక్, పరిరక్షణ కమిటీ సభ్యులు

అధ్యాపకులు నిత్య విద్యార్థులు

● పద్మావతి వర్సిటీ వీసీ ఉమ



అధ్యాపకులకు సర్టిఫికెట్లు ఇస్తున్న వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ఉండాలని పద్మావతి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పేర్కొన్నారు. ఆ వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ధృతి ఆడిటోరియంలో మూడు రోజుల పాటు అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన సమాపనోత్సవం బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీసీ ఉమ మాట్లా డారు. మారుతున్న కాలానుగుణంగా అధ్యాపకులు బోధనలో మార్పు చేర్పులు చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. దీని వల్ల విద్యా ర్థులకు మంచి నైపుణ్యాలను అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం అధ్యాపకులందరికీ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో విషయ నిపుణులు డాక్టర్ సంజీవ్‌కుమార్ (నిమ్హాన్స్, బెంగళూరు), ప్రోగ్రాం ఆర్గనైజర్స్ ప్రొఫెసర్ జాన్ సుష్మా (బయోటెక్నాలజీ), డాక్టర్ భార్గవి, పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.30 లక్షల విలువైన టపాసుల స్వాధీనం



టపాసులను సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు, పోలీసులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన దాదాపు రూ.30 లక్షలు విలువైన టపాకాయలను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అక్రమంగా టపాసులు నిల్వ ఉన్నట్లు ఫిర్యాదులు వెళ్లడంతో చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ అనిల్ బృందంతో పుంగనూరు సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ హరిప్రసాద్ దుకాణాలపై దాడులు చేశారు. స్థానిక బజారువీధి, ఎంబీటీ రోడ్డులోని మూడు దుకాణాల్లో దాడులు నిర్వహించి బాబు, శ్రీధర్, రాఘవేంద్రలను అదుపులోకి తీసుకుని వారి వద్ద అక్రమంగా ఉన్న టపాసులను సీజ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

రేపటినుంచి ఏపీటీఎఫ్ నిరసనలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం నుంచి ఈనెల 17వ తేదీవరకు నిరసన వారంగా తలపెట్టునున్నట్లు ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్, ప్రభాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు ప్రసంగించారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటంపై నిరసనలు తెలియజేయనున్నట్లు చెప్పారు. గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన, 12న మండల కేంద్రాల్లో నిరసనలు, 13న ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తులు, 14న పాత తాలూకా, 15న మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 16,17 తేదీల్లో సీఎం, సీఎస్‌లకు వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా వినతులు పంపనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి టీచర్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సబ్ కమిటీ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నగరి గంగమ్మ జాతర ప్రారంభం

నింద్ర, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరి గంగమ్మ జాతర మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఉదయం నుంచే గంగమ్మ కొలువు దీరే ప్రాంతంలోను, దేశమ్మ, ఓరుగుంటాలమ్మ ఆలయాల వద్ద మహిళలు పొంగళ్లు పెట్టారు. సాయంత్రం ఆరు గంటలకు ఓరుగుంటాలమ్మ, దేశమ్మలు తమ స్థావరం నుంచి ఊరేగింపుగా బయల్దేరి.. నగరి గంగమ్మను ప్రతిష్ఠించే ఆవరణ వద్దకు చేరుకుని ఆశీనులయ్యారు. రాత్రి తొమ్మిది గంటలకు గంగమ్మ గుడి నుంచి అమ్మవారు బయల్దేరి పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అర్ధరాత్రి తర్వాత చావడి వద్ద కొలువుదీరారు. ఈ సందర్భంగా ఓరుగుంటాలమ్మ వరలక్ష్మి అవతారంలోను, దేశమ్మ దేవత సింహ వాహిని రూపంలోనూ దర్శనమిచ్చారు. భక్తుల రద్దీని నియంత్రించడానికి ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి పొడవునా విద్యుద్దీపాలంకరణలు, వినాయక, సుబ్రహ్మణ్య, పార్వతీ సమేత మహాశివలింగం ప్రతిమలు అలరించాయి. జాతర నిర్వహణ ప్రాంతాన్ని డీఎస్పీ అజీజ్, సీఐ విక్రమ్ తమ సిబ్బందితో పరిశీలించారు. జాతర కమిటీ సభ్యులతో చర్చించి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



విశేష అలంకరణలో గంగమ్మ



సింహవాహిని అలంకరణలో దేశమ్మ - వరలక్ష్మిగా ఓరుగుంటాలమ్మ - వినాయక, సుబ్రహ్మణ్య, పార్వతీ సమేత శివలింగం ప్రతిమలు

స్వచ్ఛ కుప్పంతో అభివృద్ధి పరుగులు



కాంప్యాక్ట్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ కుప్పంతో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ అన్నారు. స్వచ్ఛ కుప్పం కార్యక్రమంలో భాగంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కాంప్యాక్ట్ వాహనంతోపాటు ఈ ఆటోలను వారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛ కుప్పం సాకారానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోమశేఖర్, సురేశ్, జగీశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, నాయకులు ఆర్ఆర్.రవి, వేణు, కన్నన్, రోహిత్, ఉమాపతి, నాగార్జున, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎస్.తులసీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఊరట

కుప్పం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబులు తగ్గించడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట లభించిందని బీజేపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి, కుప్పం రెస్కో డైరెక్టర్ ఎన్ఎస్.తులసీనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తగ్గించిన జీఎస్టీ స్లాబులతో సుమారు 330కి పైగా వస్తువులపై ముఖ్యంగా సిమెంటు, పాల ఉత్పత్తులు, సబ్బులు, నూనెలు వంటివాటిపై ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. బీమా పాలసీలపైనా జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయడం శుభ పరిణామమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో వ్యవసాయ యంత్రాలు, విత్తనాలు మధ్యతరగతి ప్రజలకు అవసరమైన వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గుముఖం పడుతాయన్నారు. జీఎస్టీ స్లాబుల తగ్గింపు, పేద మధ్యతరగతి వర్గాలకు ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన బహుమతిగా తులసీనాథ్ అభివర్ణించారు.

రైతులకు యూరియా పంపిణీ



చందంలో యూరియా పంపిణీ చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం చందం పంచాయతీ రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజల అభిమానాన్ని నిండుగా పొందుతున్నారని చెప్పారు. యూరియా 45 కిలోల బస్తా రూ.2150 కాగా.. సబ్సిడీ పోను కేవలం రూ.266 లకు రైతులకు తగినంత సరఫరా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాధాకృష్ణమూర్తి, మేఘనాథం, తులసిబాబు, చల్లప్ప, గురుస్వామి, మోహన్, రైతులు, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రయోజనాలే లక్ష్యంగా కృషి చేస్తోందని టీడీపీ సీనియర్ నేత సతీష్ తెలిపారు. మంగళవారం ఆయన రామకుప్పం మండలం కెంచనబల్లలో రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు వీరనాగపురంనాగరాజు, మతీన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే సమాజ భవిష్యత్తు



ద్రవిడ వర్శిటీ వీసీ ఉపకులపతి దొరస్వామిని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కుప్పం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ దొరస్వామి అన్నారు. కళాశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాలలో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న ఉపకులపతి ప్రొఫెసర్ దొరస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ జీవితం మొత్తాన్ని విద్యార్థుల పురోగతికి త్యాగం చేస్తానన్నారు. తాము చదువు చెప్పిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలలో స్థిరపడి, పురోభివృద్ధి చెందడమే ఉపాధ్యాయులకు ఇచ్చే గురుదక్షిణగా పేర్కొన్నారు. అలాగే కళాశాల అధ్యాపకులను ఉపకులపతి ప్రొఫెసర్ దొరస్వామి తన చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, సీనియర్ అధ్యాపకులు జగదీశ్‌బాబు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే కుప్పం పురపాలక సంఘం దళవాయికొత్తపల్లె మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలనుంచి గ్రేడ్ 2 హెచ్ఎంగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన పీఎస్‌హెచ్ఎం అమరజ్యోతి, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు రామచంద్ర, రామసుబ్రహ్మణ్యంలను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభ్యున్నతికి వారు చేసిన సేవలను కొనియాడారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

పెద్దపంజాణి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరప్పల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలు, వేతనాలు, కనీస సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయనతో ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

16న బోయకొండలో దుకాణ గదులకు వేలం

చౌడేపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు దుకాణ గదులకు ఈనెల 16న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏకాంబరం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 85 దుకాణాలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11 లోపు ఒక్కొక్క గదికి రూ.20 వేలు డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

భవిష్యత్తు తరాలకు సురక్షిత పొదుపు మార్గాలు



సదస్సులో మాట్లాడుతున్న గణేష్‌కుమార్

రామకుప్పం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యత ఐశ్వర్యానికి బాటలు వేస్తుందని రామకుప్పం ఏపీసీఎస్ మేనేజర్ గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహించిన ఆర్థిక అక్షర్యాసతపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు సురక్షిత పొదుపు మార్గాలను ఎంచుకుని భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా పొదుపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో కోదండరామయ్య, డైరెక్టర్లు సురేష్, అంజప్ప పాల్గొన్నారు.

ఎ.కొత్తకోటలో అందని యూరియా



ఏవోతో మాట్లాడుతున్న ఏ కొత్తకోట పంచాయతీ రైతులు

చౌడేపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమకు యూరియా అందలేదని ఏ కొత్తకోట రైతులు మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో మోహన్‌కుమార్‌ను నిలదీశారు. టీడీపీ నాయకులు మునిరాజు మాట్లాడుతూ ఏకొత్తకోట పంచాయతీలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని దుర్గసముద్రం రైతు సేవా కేంద్రం క్లస్టర్ పరిధిలోకి కలిపేశారన్నారు. యూరియా కోసం ఏకొత్తకోట పంచాయతీ రైతులు దుర్గసముద్రం వెళ్తే అక్కడి రైతులకే ఇచ్చేసారన్నారు. తమకు ఎందు ఇవ్వలేదని ప్రశ్నించారు. రెండు రోజుల్లో యూరియా అందుబాటులో ఉంటుందని, రైతులందరికీ పంపిణీ జరుగుతుందని ఏవో సర్ది చెప్పారు.

అర్హులైన రైతులందరికీ రుణ సౌకర్యం



మాట్లాడుతున్న సింగిల్‌విండో అధ్యక్షుడు శివశంకర్

సోమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి రైతుకు రుణ సౌకర్యం కల్పిస్తామని సింగిల్ విండో చైర్మన్ శివశంకర పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీతో బంగారు నగలపై రుణాలు అందిస్తామని.. పొదుపు పథకాలు అమలు చేయడం, రైతులకు విరివిగా వ్యవసాయ పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సీఈవో రెడ్డెప్ప, సతీశ్, అష్రఫ్ అలీ, మహేంద్రబాబు, చాణుక్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో రైతు పోరు



పలమనేరులో ర్యాలీగా వెళుతున్న వైసీపీ నాయకులు

పలమనేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం వైసీపీ ఆధ్వర్యంలో రైతు పోరు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలమనేరు ఆర్డీవో పి.భవానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు యూరియా కొరతే లేదని చెబుతున్నారన్నారు. రైతులు యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు ప్రాధాన్యం



రెడ్డిప్రసాద్ రెడ్డి

సదుం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆవిర్భావం నాటి నుంచి తెలుగుదేశం పార్టీ బీసీలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తోందని సదుం మండల టీడీపీ కన్వీనర్ రెడ్డి ప్రసాద్ రెడ్డి తెలిపారు. సదుం మండలం రెడ్డివారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గుండ్లపల్లె అమరనాథ్ గౌడ్, రాష్ట్ర బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గంలో కురబ కుల సంఘాల ద్వారా టీడీపీ పటిష్టతకు అమర్‌నాథ్ గౌడ్ చేసిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు, పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి మండల టీడీపీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

సమయపురి మారెమ్మకు విశేష పూజలు



అలంకరణలో సమయపురి మారెమ్మ

పలమనేరు, సెప్టెంబరు 9 ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా పలమనేరు గంటావూరు బీసీ కాలనీలో వెలసిన సమయపురి మారెమ్మకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు



అధ్వానంగా ఉన్న పల్లికుప్పం-పంద్యాలమడుగు రహదారి



గుంతలమయంగా ఉన్న ఎస్.గొల్లపల్లెక్రాస్- పీఎంకేతాండా రహదారి

రామకుప్పం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంద్యాలమడుగు పంచాయతీలోని పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో గ్రామీణ జనం అవస్థలు పడుతున్నారు. పల్లికుప్పం నుంచి పంద్యాలమడుగుకు, ఎస్.గొల్లపల్లెక్రాస్ నుంచి పీఎంతాండా, పీకేఎంతాండాలకు, పల్లికుప్పం నుంచి చిన్నబల్దారు మీదుగా వి.కోట మండలం రెక్కమానుకు వెళ్లే రహదారులు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. సుమారు 8 గ్రామాల ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. కొన్నేళ్లుగా రహదారులు మరమ్మతులకు నోచుకోక పోవడంతో రహదారులు ఎక్కడికక్కడ గతుకులమయంగా మారాయి. అంతేకాకుండా పలుచోట్ల కంకరతేలిపోయాయి. దీంతో ఈ రహదారుల్లో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా కిందపడి గాయాలు పాలవుతున్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో తమ గ్రామాల రహదారులకు మహర్దశ కానుందని ప్రజలు ఆశించారు. వారి ఆశల మేరకు మండలంలో పలు రహదారుల పునర్నిర్మాణం పనులు పూర్తయ్యాయి. అయితే ఎల్లికుప్పం నుంచి పంద్యాలమడుగుకు, ఎస్.గొల్లపల్లెక్రాస్ నుంచి పీఎంతాండా, పీకేఎంతాండాలకు, పల్లికుప్పం నుంచి చిన్నబల్దారు మీదుగా వి.కోట మండలం రెక్కమానుకు వెళ్లే రహదారులకు మాత్రం మోక్షం రాలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ స్థాయికి కుప్పం క్రీడా ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం విద్యార్థుల క్రీడా ప్రతిభ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు ఆకాంక్షించారు. కుప్పంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (ఐడీపీఎస్) విద్యార్థులు వి.జోశ్విక్, సాయి అశ్వంత్, తేజ్ రిషిత్ అర్జున్‌లు నేపాల్‌లో ఈనెల 11న జరగే అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల, సురేశ్‌బాబులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించి కుప్పం యువతలోని అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంను కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కుప్పం ప్రతిష్ఠ నిలబెట్టేలా ఐడీపీఎస్ విద్యార్థులు దేశం దాటి విదేశాలలో పోటీలకు ఎంపిక కావడం అందరికీ గర్వకారణమన్నారు. వారు విజయంతో తిరిగి రావాలంటూ అభినందించారు. అలాగే కడా పీడీ వికాస్ మర్మత్ విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ చైర్మన్ దయానిధి, కౌన్సిలర్ సురేశ్, కడా రాజకీయ సహామండలి సభ్యులు వెంకటేశ్, సతీశ్, పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్

రొంపిచెర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి ఒక్క గర్భం దాల్చిన మహిళ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, ల్యాబ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా వైద్యపరీక్షలు, ఆరోగ్యపరీక్షలు చేసుకోవాలని సూచించారు. కాన్పు సమయంలో 108 వాహనం సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అమ్మణ్ణి, హెచ్ఈ రాజేశ్వరి, సూపర్వైజర్ పంకజ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న మహతి ఫౌండేషన్ నిర్వాహకులు

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో డాక్టర్ షాలిని గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పోషకాహార ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ చర్యలు, వ్యక్తిగత శుభ్రత తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అలాగే తీర్థం పీహెచ్‌సీలో గర్భిణలకు వైద్యాధికారి అరుణ్‌కుమార్ ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, పీహెచ్ఎన్ శమంతక, సూపర్‌వైజర్ తిరుమలమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృథాగా ఈ-చెత్త ఆటోలు



పలమనేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో చెత్త తరలించేందుకు మూడేళ్లక్రితం అప్పటి వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేసి పంపిన ఈ చెత్త ఆటోలు అప్పుడే మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. మున్సిపాలిటీకి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 8 ఈ-ఆటోలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే అందులో నేడు మూడు ఈ ఆటోలు అప్పుడే మూలన పడ్డాయి. చిన్న చిన్న వీధుల్లో ఈ చెత్త ఆటోలటనే పొడిచెత్త, తడిచెత్త వేరువేరుగా సేకరించి కంపోస్టుయార్డుకు చేర్చేందుకు వినియోగించేందుకు మంజూరయ్యాయి. నాణ్యత లోపాలు, నిర్వహణ లోపాల కారణంగా నేడు అవి ఎందుకు పనికి రాకుండా వృథాగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సోమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యసిబ్బందికి సూచించారు. అలాగే కందూరు పీహెచ్‌సీలో వైద్యాధికారిణి డాక్టర్ విజయలక్ష్మీ వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సంకల్పంతోనే లక్ష్యాలు సాధ్యం



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సదుం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏ రంగంలో రాణించాలన్నా ధృడ సంకల్పం అవసరమని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న సంకల్పం పేరిట చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు సమాజంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎలా ఎదుర్కోవాలి అన్న అంశంపై అవగాహన కల్పించారు. బాల్యం నుంచి క్రమశిక్షణతో ఎలా ఎదగాలన్న అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన ఏఎంసీ చైర్మన్ శమిపతి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పర్యటనకు వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతి సన్మానించారు. మంగళవారం స్థానిక ఫారెస్ట్ అతిథి గృహంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, టీడీపీ నాయకుడు సీవీరెడ్డి పాల్గొన్నారు.

కందూరులో రోడ్డుపైనే దుకాణాలు

సోమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కందూరు మేజర్ పంచాయతీ కేంద్రంలో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని.. జిల్లా అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. నూతనంగా రోడ్డు వెడల్పుతో డ్రైనేజీ కాలువలు నిర్మించారు. ఆ కాలువలపైనే దుకాణదారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఆలయాల సందర్శన

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మంగళవారం చిత్తూరు నగరంలోని ఆలయాలను సందర్శించారు. అయ్యప్ప మాలధారణలో ద్విచక్రవాహనంపై వెళ్లి పూజలు చేశారు.

పేదరికం లేని సమాజాన్ని నిర్మిద్దాం



శిక్షణకు హాజరైన సర్పంచులు, ఎంపీటీసీలతో అధికారులు

కల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజాన్ని నిర్మిద్దామని ఇన్‌చార్జి ఎంపీడీవో మునిరాజ తెలిపారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీల అభివృద్ధిపై సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్లు నాగరాజు, ప్రవీణ్‌కుమార్, లోకేష్, ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రజాప్రతినిధులు సేవలు అందించాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య రంగాల్లో వందశాతం ఫలితాలు సాధించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

●**బైరెడ్డిపల్లె:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ పురోగతిపై ప్రజాప్రతినిధులు, వివిధశాఖల సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, పంచాయతీల ప్రగతికి చేపట్టాల్సిన పద్ధతులు, పర్యవేక్షణ విధానాలపై వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో ఆనందబాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటసాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏపీవో హరినాథ్, ఏపీఎం లలిత, ఎంఆర్‌సీ సురేష్‌బాబు, రిసోర్స్‌పర్సన్లు విజయ, రాము, గణేష్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామకార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చీకటి రోజుకు రెండేళ్లు

విజన్ ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబు : ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అక్రమ కేసులో అరెస్టు చేసిన చీకటి రోజుకు నేటికి రెండేళ్లయిందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు అరెస్టును రాష్ట్ర ప్రజలతోపాటు ప్రపంచంలోని తెలుగువారంతా తీవ్రంగా ఖండించారని పేర్కొన్నారు. దేశంలోనే విజన్ కలిగిన నాయకుడు సీఎం చంద్రబాబు మాత్రమేనన్నారు. ఏపీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తి సీఎంకు మాత్రమే ఉందని వివరించారు.

ఎమ్మెల్యే ఆలయాల సందర్శన



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ చిత్తూరు నగరంలోని ఆలయాలను మంగళవారం సందర్శించారు. అయ్యప్ప మాలధారణలో ద్విచక్రవాహనంపై గిరింపేట దుర్గాంబ, కామాక్షి అగస్తీశ్వర, కట్టమంచి కులందేశ్వర, కోదండరామ, మహాక్ష్మి, గోదాదేవి, ఆంజనేయ సమేత శ్రీవెంకటేశ్వర, పొన్నియమ్మ, చెంగలాయకొండ సుబ్రహ్మణ్యేశ్వర, రాజుగుడి, తేనెబండ ముత్యాలమ్మ, కట్టమంచి వరదరాజ స్వామి ఆలయాలను సందర్శించి.. పూజలు చేశారు.

'సర్వమత సమానత్వమే ఇస్లాం అభిమతం'



చిన్న మసీదులో జరిగిన కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సర్వమత సమానత్వమే ఇస్లాం అభిమతం అని ముస్లిం మత పెద్దలు తెలియజేశారు. బజారు వీధిలోని చిన్న మసీదులో మంగళవారం సీరత్-ఉన్-నబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అబ్దుల్లా, మహ్మద్ సాహెబ్, ముత్తర వలీ, షేరూ సాహెబ్, అల్తాఫ్, రియాజ్ పాల్గొన్నారు.

వేగంగా హైరోడ్డు విస్తరణ పనులు



చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):నగరంలో హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మంగళవారం కట్టమంచి వద్ద ఓ ప్రైవేటు భవన యజమాని నుంచి రోడ్డుకు అవసరమైన స్థలాన్ని ఏసీపీ నాగేంద్ర సేకరించారు. అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో అందులోని భవనాలను తొలగించారు. టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ వనిత ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐదుగురు ఉపాధ్యాయులను వాసవీ కళ్యాణ మండపంలో మంగళవారం సన్మానించారు. 20 మంది పేద వృద్ధులకు రూ.200 చొప్పున అందజేశామని వైస్ గవర్నర్ వాణి, అధ్యక్షురాలు లీలాకుమారి తెలిపారు. ఈ మొత్తాన్ని పెన్షన్ మాదిరిగా వీరికి ప్రతినెలా అందజేస్తామన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యదర్శి లలితాదేవి, కోశాధికారి కుసుమ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



సంధ్య

బంగారుపాళ్యం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. ఏఎస్ఐ మల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. కాటప్పగారిపల్లె పంచాయతీ ఎగువ ఎద్దులవారిపల్లె దళితవాడకు చెందిన సంధ్య స్థానిక అమర్‌రాజా ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. ఈ నెల ఆరో తేదీన నైట్ డ్యూటీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భర్త హేమచంద్ర చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ కానరాలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాపై నిరాధార ఆరోపణలు: ఆర్పీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తనపై కొంతమంది మహిళలు నిరాధార ఆరోపణలు చేశారని చిత్తూరు నగరపాలక సంస్థ రిసోర్స్ పర్సన్ (ఆర్పీ) బేబీ శ్వేత అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. మెప్మా అధికారిగా పనిచేసిన రమణ ప్రోద్బలంతో మహిళా సంఘాల సభ్యుల పేరిట భువనేశ్వరి, ఉషారాణిలు తనపై నిరాధార ఆరోపణలు చేశారని చెప్పారు. రమణ తనపట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఫిర్యాదు చేయడం వల్లే తనపై కక్ష సాధింపుగా తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని విమర్శించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని, విచారించి న్యాయం చేయాలని అధికారులను కోరారు.

మాతాశిశు మరణాలు నివారిద్దాం



సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి

చిత్తూరురూరల్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలు నివారిద్దామని డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని డీసీహెచ్ఎస్ చాంబర్‌లో జిల్లా, ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులతో జననీ సురక్ష యోజనపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఎంఎస్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఎస్టీలకు అవగాహన

ఐరాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐరాల పంచాయతీ గోవిందరెడ్డిపల్లె ఎస్టీ కాలనీ ప్రజలకు ప్రభుత్వ పథకాలపై మంగళవారం ఎంపీడీవో ధనలక్ష్మి అవగాహన కల్పించారు. ఆత్మ మాజీ చైర్మన్ అయిరాల రాజేష్‌రెడ్డి, టీడీపీ బూత్ కమిటీ వైస్ చైర్మన్ సాయీశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గిరి, మహిళా పోలీస్ రాజేశ్వరి, పంప్ ఆపరేటర్లు జయచంద్ర, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కట్ట పుట్టాలమ్మ జాతర



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విలాసవరాహపురం గ్రామంలో మంగళవారం కట్ట పుట్టాలమ్మ జాతర వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కు తీర్చుకున్నారు. ముఖ్య అతిథిగా చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. అన్నదానం ఉభయదారులుగా లక్ష్మీకుమారి, సిద్దయ్యశెట్టి కుటుంబీకులు వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. సిద్దయ్యశెట్టి, పైనేని మురళి, రవి, బాబునాయుడు, వేమానాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస నారాయణి సేవ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో మంగళవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాబాకు మాస నారాయణి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి, గాంధీ సెంటర్, లెప్రసీ కాలనీ, లెనిన్ నగర్ తదితర ప్రాంతాల్లోని పేదలకు భోజన పొట్లాలు, తాగునీరు వితరణ చేశారు. సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్‌నాయుడు, పాండురంగం, శివప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకంలోని ఓ సన్నివేశం



పేటమిట్ట మంగళ విద్యాలయ విద్యార్థినుల నృత్య ప్రదర్శన

వరసిద్ధుడికి మహానందీశ్వరుడి పట్టు వస్త్రాలు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని నంద్యాల జిల్లాలోని మహానందీశ్వరాలయ అధికారులు పట్టువస్త్రాలను మంగళవారం సమర్పించారు. మహానంది ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తన సిబ్బందితో కలసి పట్టువస్త్రాలు తీసుకొచ్చి వరసిద్ధుడి ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ వారిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. మహానంది ఆలయ ఏఈవో మధు, కాణిపాక ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, అర్చక, పండితులు పాల్గొన్నారు.





పట్టువస్త్రాలు తీసుకొచ్చిన మహానందీశ్వరాలయ అధికారులు - సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవర్లను తీసుకొస్తున్న ఉభయదారులు

జాతర సందడి

నింద్ర, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలో జాతర సందడి నెలకొంది. కేవీపీఆర్ పేట గ్రామ దేవతలైన పొన్నియమ్మ, ఎల్లమ్మ, ఏకాంబరకుప్పం గ్రామదేవత తొప్పయమ్మ దేవతకు జాతర్లను మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు బుగ్గదేవాలయం నుంచి పవిత్ర జలాలను సేకరించి ఊరేగింపుగా గ్రామదేవతలు ఆలయాలకు చేరుకున్నారు. పవిత్ర జలంతో అమ్మవారి ప్రతిమలకు అభిషేకం చేశారు. ప్రతి ఏడాదిలాగే భక్తులు అగ్గిసట్టి తలపై తీసుకురావడం, శరీరమంతా శూలాలు గుచ్చుకోవడం, వీపుకు, కాళ్లకు, చేతులకు ఇనుప కొక్కీలు గుచ్చుకుని వాహనాలకు వేలాడటం, వాహనాలను లాగడం వంటి లాంటి సాహసోపేత మొక్కుబడులను ఇక్కడి భక్తులు తీర్చుకున్నారు. వీటిని చూడడానికి జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ కూడా ఈ జాతర వేడుకల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.



కేవీపీఆర్ పేట జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే భానుప్రకాష్





శరీరానికి ఇనుప కొక్కీలు గుచ్చుకుని వాహనానికి వేలాడుతున్న భక్తులు - శూలాలు గుచ్చుకున్న భక్తులు

రైతులను ఇబ్బంది పెట్టిన జగన్: తెలుగు యువత

గుడిపాల. సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులను ఇబ్బందులు పెట్టిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కుతుందని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ పాలనలో వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్య, ఆక్వా రంగాలు పూర్తిగా దెబ్బ తిన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. అయినా వైసీపీ నాయకులు తమ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం సరికాదని చెప్పారు.

'రణభేరి'ని విజయవంతం చేయండి : యూటీఎఫ్



నగరిలో రణభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నింద్ర, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే రణభేరిని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొలిరోజున కుప్పంలో బైక్‌జాతా ప్రారంభమై వి.కోట, పలమనేరు, చిత్తూరు, నగరి మీదుగా తిరుపతి జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ పి.ఆర్.మునిరత్నం, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు వంశీకృష్ణ ప్రసంగించారు. టీచర్లు యువరాజ్, రూబన్, హరీష్, ప్రకాష్, సంతోష్, జనార్ధన్, బీజే సురేష్, రమేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని పొలకలలోని జడ్పీ హైస్కూల్‌లో రణభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం, మండల అధ్యక్షుడు దేవరాజులు, కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీల పురోగతి'పై శిక్షణ

పాలసముద్రం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల పురోగతి సూచిక-1పై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నిధుల సద్వినియోగంతోపాటు పంచాయతీ ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు.

విజయపురం: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, పశువైద్యాధికారి సుజాత, ఏపీఎం సురేష్, ఎంపీహెచ్‌ఏ చంద్రమోహన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

పెనుమూరు: ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ట్రైనర్ మనోరంజని, శిక్షణ ఇచ్చారు.ఏఈ రమేష్‌బాబు, ఏపీవో గుణశేఖర్, ఏపీఎం చిరంజీవి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రోగులకు అన్నదానం

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):గంగాధరనెల్లూరు పీహెచ్‌సీలో రోగులకు చిత్తూరుకు చెందిన ఎం.వి.కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు. ప్రతినెలా ఫౌండేషన్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ముందుకొచ్చి ఇలా అన్నదానం చేయడం అభినందనీయమని పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. సీహెచ్‌వో కృష్ణయ్య, సూపర్‌వైజర్ భగవతి, హెల్త్ అసిస్టెంట్ కదిరివన్, సిబ్బంది పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్‌ను కోరిన చైర్మన్



కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను సన్మానించిన రమేష్ నాయుడు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను చైర్మన్ కాంద్ర రమేష్ నాయుడు కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ.. ఇప్పుడిప్పుడే బ్యాంకు రూ.1.46 కోట్ల లాభాల బాటలోకి వచ్చిందని చెప్పారు. డైరెక్టర్లు సురేష్ బాబు, అన్సర్, నరసింహులు, సీఈవో సుమతి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్ మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ సీఎఫ్‌వో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతకు సన్మానం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత శరత్‌చంద్రశేఖర్‌ను మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు సన్మానించారు. బీఎన్ఆర్‌పేట కళాశాలలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది.

గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషిచేయాలి: డీపీవో



సమావేశంలో ప్రసంగిస్తున్న సుధాకర రావు

పూతలపట్టు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని డీపీవో సుధాకర రావు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల పురోగతి సూచిక-1పై మంగళవారం జరిగిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పలు సూచనలిచ్చారు. ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీపీ కుమారి, జడ్పీటీసీ దేవిక, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 11 మందికి జరిమానా

చిత్తూరుఅర్బన్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌కేసులో 11మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. రెండ్రోజులుగా నగరంలో తనిఖీలు చేపట్టారు. మద్యంతాగి వాహనాలు నడిపిన 11మంది కేసు నమోదు చేశారు. వీరిని జడ్జి ఉమాదేవిముందు మంగళవారం హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని సీఐ తెలిపారు.

శిథిలావస్థలో గుడిపాల పశువైద్యశాల





శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల భవనం - నెర్రెలు బారిన స్లాబు

గుడిపాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుడిపాల పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాద జరుగుతుందోనని పాడి రైతులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్యశాల స్లాబు పెచ్చులూడి, నెర్రెలుబారి వర్షం వస్తే తడుస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు. తలుపులు కూడా ఊడిపోవడంతో మందులను భద్రపరచడానికి వైద్యాధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుక్కలు బాబోయ్..!

వెదురుకుప్పం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లంలో కుక్కల హల్‌చల్ ఎక్కువైంది. వీటివల్ల చిన్న పిల్లలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. బైక్‌ల్లో వెళ్లేవారిని ఇవి వెంబడిస్తున్నాయి. వీటివల్ల తరచూ గాయపడుతున్నామని స్థానికులు తెలిపారు. కుక్కల కట్టడికి చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి చేస్తున్నారు.



సంక్షిప్తంగా..

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షతన ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరగనుంది. ఈ మేరకు చిత్తూరు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ సురేష్‌కుమార్, గంగాధరనెల్లూరు డీఈ శేషాద్రిరెడ్డి తెలిపారు. గంగాధరనెల్లూరు, కార్వేటినగరం, నగరి సబ్‌డివిజనల్ పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చన్నారు.

రేపు తవణంపల్లె మండల సమావేశం

తవణంపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండల సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీవో రెడ్డిబాబు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. అలాగే వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరు కావాలన్నారు.

పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ

నింద్ర, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా పైపులైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం భూమిపూజ చేశారు. పట్టణంలోని 8, 21 వార్డుల్లో సుమారు 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.28లక్షలతో ఈ పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు.

బీఎస్పీ నాయకుడి మృతి



కోదండపాణి (ఫైల్ ఫొటో)

ఐరాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండల సీనియర్ బీఎస్పీ నాయకుడు కోదండ పాణి (61) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి తమకు తీరని లోటని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

విజయపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఎంపీటీసీ లక్ష్మీపతిరాజు సతీమణి గీత మృతి చెందడంతో మంగళవారం జంబాడ సమీపంలోని నెహ్రూ నగర్‌లో ఆమె భౌతిక కాయానికి నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబీకులను పరామర్శించారు. పలువురు టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి



నింద్ర, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రి రోజా కోరారు. ఈ మేరకు మంగళవారం నగరి టవర్‌క్లాక్ సెంటర్ నుంచి వైసీపీ శ్రేణులో కలిసి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్డీవో అనుపమకు వినతిపత్రం అందజేశారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

యాదమరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా యాదమరి పీహెచ్‌సీలో గర్భిణులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీపతి, ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్ట్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.